ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 239

పేజీలు : 5 వెల రూ. 2/-

మంగళవారం
16 డిసెంబర్ 2025

PUBLISHED FROM :
HYDERABAD

# AM న్యూస్

ప్రతిదినం ప్రత్యేకం

www.amnews7.com

## తిరుమలలో పటిష్టంగా వైకుంఠద్వార దర్శనాలు

ఏర్పాట్లను పరిశీలించిన ఛైర్మన్ నాయుడు




2 లో

## జోర్డాన్ చేరుకున్న ప్రధాని మోడీ

ఘనంగా స్వాగతించిన భారత సంతతి ప్రజలు



2 లో

## జిహెచ్ఎంసిలో వార్డుల పునర్విభజన

- భారీగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేతలు..
- ప్రధానంగా ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యేల అభ్యంతరం..



2 లో

## గాయకుడు బాలు అందరివాడు

- మన తెలుగవాడు కావడం గర్వకారణం
- స్వరసరస్వతిని స్మరించుకోవడం అదృష్టం
- బాలు విగ్రహావిష్కరణలో వెంకయ్యనాయుడు



2 లో

## బిజెపి వర్కింగ్ ప్రసిడెంట్ నితిన్ నబిన్

- పార్టీ కార్యాలయంలో బాధ్యత స్వీకరణ




2 లో

# పంచాయితీ ఎన్నికలతో కాంగ్రెస్ పతనం

- బిఆర్ఎస్ రెండోవిడతలోనూ అద్భుత ఫలితం
- కాంగ్రెస్ మోసాలతో ప్రజలు విసుగెత్తారు
- రేవంత్ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత స్పష్టం
- పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపిన కెటిఆర్
- కొత్త సర్పంచ్‌లను ఇబ్బంది పెడితే సహించం
- వారికి అండగా జిల్లాల్లో ప్రత్యేక న్యాయ విభాగం ఏర్పాటు..
- నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో కెటిఆర్..

వివరాలు 2లో



# జిహెచ్ఎంసిలో వార్డుల పునర్విభజన

**ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబరు15:**
జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజనపై భారీగా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల శివారు ప్రాంతాలను విలీనం చేయడంతో 300 వార్డులు ఏర్పాడ్డాయి. అయితే దీనిపై అభ్యంతరాల స్వీకరణ సోమవారంతో పూర్తి అయ్యింది. ఈ క్రమంలో మంగళవారం బల్దియా ప్రత్యేక కౌన్సిల్ సమావేశం కానుంది. ఈ కౌన్సిల్‌లో కార్పొరేటర్ల అభిప్రాయాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తీసుకోనున్నారు. తద్వారా వార్డులు పనుర్విభజన ఏమైనా ఉంటే చేస్తారు. ఇప్పటి వరకు 1,328 అభ్యంతరాలు వచ్చాయి. ఆదివారం ఒక్కరోజే 227 అభ్యంతరాలు స్వీకరించారు అధికారులు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్, జోనల్, సర్కిల్ ఆఫీసుల్లో అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు జీహెచ్ఎంసీ అధికారులు. 17వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలోనే వార్డుల విభజనపై అభ్యంతరాలు తెలపడానికి జీహెచ్ఎంసీకి క్యూ కట్టారు నగర ఎమ్మెల్యేలు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కార్పొరేటర్లతో మేయర్ గద్వాల విజయలక్ష్మి సమావేశం అయ్యారు. వార్డుల పునర్విభజన శాస్త్రీయంగా చేయాలంటూ మేయర్‌కు వినతిపత్రం ఇచ్చారు కాంగ్రెస్ కార్పొరేటర్లు. ఇవాళ మధ్యాహ్నం రెండు గంటలకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేతృత్వంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను కలవనున్నారు. నగర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు. వార్డుల విభజనపై అభ్యంతరాలు తెలపనున్నారు. జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజనపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వార్డుల విభజనపై తమకు కన్ఫ్యూజన్ ఉందని తెలిపారు. డీ లిమిటేషన్‌పై అభ్యంతరం తెలపడానికి కమిషనర్‌ను కలిశామని వెల్లడించారు. కనీసం తమకు సమాచారం లేకుండానే, ఎమ్మెల్యేల అభిప్రాయం లేకుండానే డీ లిమిటేషన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డీ లిమిటేషన్‌పై కార్పొరేటర్లలో ఆవేదన ఉందని చెప్పుకొచ్చారు. తమ అభ్యంతరాలు మేయర్, కమిషనర్‌కి లిఖిత పూర్వకంగా ఇచ్చామని వివరించారు. జీహెచ్ఎంసీ విస్తరణ జరగడం బాగుందని.. కానీ తమకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని... వాటిని పరిగణనలోకి తీసుకోవాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. డివిజన్ల విభజనపై ఎలాంటి సమస్యలు ఉన్నాయనే అంశాలు గుర్తించామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. కొన్ని డివిజన్‌లలో ఎక్కువ ఓట్లు మరికొన్ని డివిజన్‌లలో తక్కువ ఓట్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.
ప్రతి విషయాన్ని మేయర్, కమిషనర్‌లకు వివరించామని అన్నారు. కౌన్సిల్‌లో అభ్యంతరాలపై వివరంగా చర్చిస్తామని తెలిపారు. వార్డులు మార్పు చేయడానికి ఏం అవకాశం ఉందో గుర్తించాలని అన్నారు. హద్దులు తెలియకుండా అధికారులు వాటిని ఖరారు చేశారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు.

# అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం

- 58 అడుగుల విగ్రహం ఏర్పాటు
- సంస్మరణ సభలో సిఎం చంద్రబాబు



**ఏఎం న్యూస్, విజయవాడ,డిసెంబర్ 15:**
రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అందులో 58 అడుగుల ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సోమవారం విజయ వాడలోని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు పోరాడారని తెలిపారు. ఆయన ఆత్మార్పణంతో రాష్ట్రం రగిలిపోయిందని గుర్తు చేశారు.తెలుగుజాతి గుర్తింపు కోసం పోరాడిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగుజాతి కోసం జీవితాన్నే త్యాగం చేసిన వ్యక్తి ఆయన అని కొనియాడారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు పోరాటం చేశారన్నారు. తన పోరాటంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. 1952లో మద్రాస్‌లోని బలుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించారు. 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసి చనిపోయారు. నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడి ప్రాణత్యాగం చేశారు. ఆయన మృతితో తెలుగు తమ్ముళ్లు బయటకు వచ్చి పోరాడారు. దీంతో తెలుగువాళ్లకు ప్రత్యేక రాష్ట్రం ఇస్తామని అప్పటి ప్రధాని ప్రకటించారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసిన రోజును స్మరించుకుంటున్నాం. త్యాగం చేసిన వ్యక్తి కుటుంబ సభ్యులను గౌరవించుకోవడం మన సంప్రదాయం. అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేస్తున్నాం. దీని కోసం 6.8 ఎకరాలు కేటాయించాం. 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తున్నాం. పొట్టి శ్రీరాములు ప్రాణాలు విడిచిన భవనాన్ని స్మారక కేంద్రంగా మారుస్తాం. పొట్టి శ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదు.. తెలుగు ప్రజల ఆస్తి అని చంద్రబాబు అన్నారు.ఇదిలావుంటే అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు. సోషల్ మీడియా ఎక్స్‌వేదికగా సీఎం స్పందిస్తూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే దృఢ నిశ్చయంతో పోరాడిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ప్రాణాలను కూడా లెక్క చేయకుండా ప్రత్యేక రాష్ట్రం పోరాడారని అన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న ధీరోదాత్తుడు పొట్టి శ్రీరాములు అని సీఎం తెలిపారు. ఆమహనీయుడు ప్రాణ త్యాగఫలమే ఈరోజు మనకున్న భాషాప్రయుక్త రాష్ట్రాలని డిప్యూటీ సీఎంపవన్ అన్నారు.

# పంచాయితీ ఎన్నికలతో కాంగ్రెస్ పతనం



**ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబరు15:**
రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో అద్వితీయ ఫలితాలు సాధించిన గులాబీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుందన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ సత్తా చాటిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు. అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఇక కాలం చెల్లిందని ప్లలె ప్రజలు తమ ఓటు ద్వారా మరోసారి తేల్చిచెప్పారని అన్నారు. ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ కోటలు బీటలు వారడం, రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి నిదర్శనమని పేర్కొన్నారు.రేవంత్ రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలకు తోడు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే, కాంగ్రెస్ కు ఉరితాళ్లుగా మారి ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో పెకిలిస్తున్నాయని కేటీఆర్ తెలిపారు. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే అధికార పార్టీ దుస్థితి ఇలా ఉంటే, ఇక పార్టీ గుర్తుపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇంతకన్నా ఘోర పరాభవం తప్పదని వ్యాఖ్యానించారు. అరాచక పాలనతో తెలంగాణ బతుకుచిత్రాన్ని ఛిద్రంచేస్తున్న రేవంత్ రెడ్డికి పంచాయతీ ఎన్నికల్లో వస్తున్న ఈ ఫలితాలు చెంపపెట్టులాంటివని అన్నారు. నాడు బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం, పల్లె పల్లెనా అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతమని అన్నారు.కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు, రిక్త హస్తం అని రెండేళ్ల పాలనలోనే తెలిపోయిన నేపథ్యంలో ఇక సీఎం రేవంత్ అసమర్థ పాలనలో అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. రెండేళ్లుగా కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అరాచకాలు, మోసాలు, అవినీతి కుంభకోణాలపై అనునిత్యం బీఆర్ఎస్ సాగిస్తున్న సమరాన్ని గుండెల నిండా ఆశీర్వదిస్తున్న తెలంగాణ సమాజానికి శిరస్సు వంచి పాదాభివందనలు తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ కబంధహస్తాల నుంచి విడిపించే ఈ పోరాటాన్ని తమ భుజాలపై మోస్తున్న గులాబీ సైనికులను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని భరోసానిచ్చారు. నాడు బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం, అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతం అన్నారు. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుంది' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.
రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని, వారి రక్షణ కోసం ప్రతి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి గెలుపొందిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులను అభినందిస్తూ, వారికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని కేటీఆర్ భరోసా ఇచ్చారు. 'మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులు గానీ, పాలకపక్ష నేతలు గానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకండి. వెంటనే పార్టీని సంప్రదించండి. మీ కోసం ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. అరగంటలో పార్టీ యంత్రాంగం మీకు అండగా నిలుస్తుంది, కోర్టు ద్వారా మన హక్కుల కోసం కొట్లాడుదాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు రావాల్సిన ఫైనాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరని, ఆ నిధులు సాధించుకునే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేవలం రెండేళ్ల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్లు, మహిళలకు తులం బంగారం వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 40 నుండి 70 శాతం స్థానాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు గెలవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. సూర్యాపేట జిల్లాలో మల్లయ్య యాదవ్ హత్య, తిప్పర్తిలో కిడ్నాప్ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం చేసిన ప్రజల వ్యతిరేకత నుంచి కాంగ్రెస్‌ని కాపాడలేకపోయారని కేటీఆర్ అన్నారు. మంత్రులు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నాయకుల అరాచకాలకు బెదరకుండా భయపడకుండా ప్రజలు మా పార్టీ నేతలు నిలబడ్డారని.. అందుకే అత్యధిక స్థానాల్లో ప్రతిపక్షంలో ఉన్న మా పార్టీని గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పట్ల నెలకొన్న తీవ్రమైన అసంతృప్తికి వ్యతిరేకతకు పంచాయతీరాజ్ ఎన్నికల ఫలితాలు నిదర్శనం అన్నారు.
సర్పంచులు కేవలం పదవులను అలంకారప్రాయంగా కాకుండా, గ్రామ అభివృద్ధికి సాధనంగా వాడుకోవాలని కేటీఆర్ సూచించారు. సూర్యాపేట జిల్లాలోని 'ఏపూర్' గ్రామాన్ని ఉదాహరణగా తీసుకుంటూ.. అక్కడ చెక్ డ్యాంలు, వైకుంతధామం, పల్లె ప్రకృతి వనం వంటి నిర్మాణాలతో ఆ గ్రామం దేశంలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందిందని గుర్తుచేశారు. ఐదేళ్ల తర్వాత ప్రజలు మనల్ని గుర్తుపెట్టుకోవాలంటే, మనం చేసిన పనే మనకు శ్రీరామరక్ష అని హితవు పలికారు. ప్లలె ప్రగతి ద్వారా ప్రతి ఊరిలో నర్సరీ, డంప్ యార్డ్, ట్రాక్టర్, వైకుంతధామం వంటివి ఏర్పాటు చేసి గ్రామాల రూపురేఖలు మార్చామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల పక్రియ పూర్తయిన వెంటనే, గెలిచిన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పంచాయతీరాజ్ చట్టం, విధులు, హక్కులపై అవగాహన కల్పించేందుకు నిపుణులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామని కేటీఆర్ వెల్లడించారు. మిగిలిన విడత ఎన్నికల్లోనూ పార్టీ శ్రేణులు కష్టపడి గులాబీ జెండా ఎగురవేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. దేశ జనాభాలో కేవలం 3 శాతం ఉన్న తెలంగాణ, కేంద్రం ప్రకటించిన ఉత్తమ పంచాయతీ అవార్డుల్లో 30 శాతం కైవసం చేసుకుందని, ఇది కేసీఆర్ పాలన దక్షతకు నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రికార్డును దేశంలో ఏ రాష్ట్రం కూడా సాధించలేదని అన్నారు. ప్రతి గ్రామంలో కనీస మౌలిక వసతులను ఏర్పాటు చేశామని ప్రతి గ్రామానికి పరిశుద్ధ నిర్వహణ నుంచి మొదలుకొని పచ్చదనం వరకు తాగునీటి సరఫరా వరకు అన్ని రంగాల్లో అద్భుతమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అందుకే తెలంగాణ పంచాయతీ రాజ్ వ్యవస్థకు కేంద్రం నుంచి అనేక అంశాల్లో ఉత్తమ గ్రామ పంచాయతీలు ఉత్తమ జిల్లా పరిషత్తులు అవార్డులను దక్కించుకున్నాయని అన్నారు.

# బిజెపి వర్కింగ్ ప్రసిడెంట్ నితిన్ నబిన్

**ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,డిసెంబర్ 15:**
బీజేపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన బీహార్ మంత్రి నితిన్ నబిన్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర పార్టీ నాయకుల సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. బీజేపీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న తర్వాత నితిన్ నబిన్‌కు ఘన స్వాగతం లభించింది. అమిత్ షా, నడ్డా, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, రవిశంకర్ ప్రసాద్, ఢిల్లీ సీఎం రేఖ గుప్తా సహా వివిధ నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం చెప్పారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి నబిన్ మాట్లాడుతూ.. నాలాంటి చిన్న కార్యకర్తకు పార్టీ చాలా పెద్ద బాధ్యత అప్పగించిందన్నారు. కార్యకర్తల నిబద్ధత, కృషిని పార్టీ గుర్తిస్తుందనడానికి ఇదే నిదర్శమని చెప్పారు. దివంగత నవీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా కొడుకే నితిన్ నబీన్. కాయస్త కమ్యూనిటీకి చెందిన ఆయన.. ఇప్పటివరకూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2006లో ఆయన తండ్రి నవీన్ కిశోర్ మరణంతో పాట్నా వెస్ట్ అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు బీజేపీ అధిష్టానం నితిన్‌ను నిలబెట్టింది. అప్పటి నుంచి గత రెండు దశాబ్దాల్లో ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల ముగిసిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బంకీపూర్ నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తోన్న నబిన్ బీహార్ ప్రజా పనుల శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ పార్లమెంటరీ బోర్డు పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్‌ను నియమించింది. త్వరలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడిగానూ ఆయనకు బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు బీజేపీ వర్గాల సమాచారం.

## తిరుమలలో పటిష్టంగా

# వైకుంఠద్వార దర్శనాలు

**ఏఎం న్యూస్, తిరుమల,డిసెంబర్ 15:**
తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వైకుంఠ ద్వార దర్శనాలకు విస్తృత ఏర్పాట్లు చేశామని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు ఉంటాయని చెప్పారు. తిరుమలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి మూడు రోజులకు ఎలక్ట్రానిక్ లక్కీడిప్ ద్వారా టోకెన్లు కేటాయించాం. మిగతా ఏడు రోజులు సామాన్య భక్తులకు టోకెన్లు లేకపోయినా సర్వదర్శనం ద్వారా వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టిసారించాం అని తెలిపారు. భక్తుల రద్దీ ఉన్న ప్రదేశాల్లో ఏర్పాట్లు, సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. దాత మంతెన రామలింగరాజు సహకారంతో పీఏసీలను అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతాం అన్నారు. ఇటీవల రూ.9కోట్లు విరాళంగా ఆయన అందించారు. ఆలయ ధ్వజస్తంభాల కోసం 100 ఎకరాల్లో స్వయంగా దివ్య వృక్షాలను పెంచాలని భావిస్తోంది. పలమనేరులో తితిదే గోశాల ఆవరణ వృక్షాల పెంపుదలకు అనువైన స్థలంగా గుర్తించాం. మంగళవారం తితిదే పాలకమండలి సమావేశం జరుగుతుంది. 50 అజెండా అంశాలపై చర్చిస్తాం. దివ్య వృక్షాల ప్రాజెక్టుపై పాలక మండలి సమావేశంలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తాం అని బీఆర్ నాయుడు తెలిపారు.ఇదిలావుంటే బోర్డు సభ్యులు శాంతారం, నరేష్ కుమార్‌లతో కలిసి తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-2 ను పరిశీలించారు. ఈ సందర్భంగా లాకర్ల జారీ కేంద్రం, కళ్యాణకట్ట, అన్నప్రసాద విభాగాలను పరిశీలించి భక్తులతో మాట్లాడారు. గత వైకుంఠ ఏకాదశి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలపై భక్తులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని, అయితే సాధారణ భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈఈ వేణుగోపాల్, డిప్యూటీ ఈవో (రిసెప్షన్) భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గాయకుడు బాలు అందరివాడు

**ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్ 15:**
ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకమని, బాలును అభిమానింగా గౌరవించుకోవడం తెలుగువారిగా మనకంతా గర్వ కారణమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. రవీంద్ర భారతి ప్రాంగణంలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్ బాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భావితరాల కోసమే రవీంద్రభారతిలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి బాల సుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నెల్లూరులోని తన ఇంటిని వేద పాఠశాలకు బాలు ఇచ్చేశారని గుర్తు చేశారు. బాలు మన మధ్య లేకున్నా.. పాట రూపంలో మనతోనే ఉన్నారని చెప్పారు. ప్రతిఒక్కరి మనస్సులో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. తన తండ్రి, ప్రముఖ గాయకుడు బాల సుబ్రహ్మణ్యం రాజకీయాలకు అతీతంగా ఉండేవారని ఎస్పీ చరణ్ గుర్తుచేసుకున్నారు. ఆయనకు అందరూ ఒకటే అని పేర్కొన్నారు. రవీంద్ర భారతి ఆవరణలో ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో చరణ్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం, తెలుగు ప్రజలు, బాలు విగ్రహం ఏర్పాటుకు నాలుగేళ్లుగా కృషి చేసిన బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి అందరితో ఎంత స్నేహపూర్వకంగా ఉండేవారన్న దానికి ఈ కార్యక్రమం ఓ నిదర్శన మన్నారు.మరోవైపు.. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ వాదులు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతోపాటు ఉద్యమకారుడు పృథ్వీరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో విగ్రహా ఆవిష్కరణ సమయంలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన తెలంగాణ వాదులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రవీంద్ర భారతితో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.

# జోర్డాన్ చేరుకున్న ప్రధాని మోడీ

**అమ్మాన్,డిసెంబర్15:**



భారతీయ సంతతి భారత్-జోర్డాన్ సంబంధాలకు గణనీయమైన కృషి చేస్తున్నారని భారత ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రధాని మోదీకి జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో భారతీయ సంతతి నుంచి అపూర్వ స్వాగతం లభించింది. మూడు దేశాల పర్యటనలో భాగంగా సోమవారం మొదటి జోర్డాన్‌కు చేరుకున్న ప్రధాని మోదీని హోటల్ వద్ద జోర్డాన్ లోని భారత సంతతికి చెందిన వారు భారత జాతీయ జెండాను చేతబట్టి ప్రధాని మోదీకి నమస్కరించి స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని వారిని ప్రేమతో పలుకరించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ డిసెంబర్ 15 నుంచి 18 వరకు జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ మూడు దేశాల్లో పర్యటిస్తారు. ఈ పర్యటన ద్వారా ఆయా దేశాలతో పురాతన సంస్కృతిక సంబంధాలతో పాటు ఆధునిక ద్వైపాక్షిక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయాలన్నది ప్రధాని పర్యటన ప్రధాన లక్ష్యం. ప్రధాని మోదీ.. జోర్డాన్ సందర్శన భారత్-జోర్డాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతోంది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ.. జోర్డాన్ రాజు అబ్దుల్లా ఎఐ ఇబ్న్ అల్ హుస్సేన్, ఆ దేశ ప్రధాని జాఫర్ హసన్‌లతో భేటీ కానున్నారు. జోర్డాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఇథియోపియా, ఒమన్ దేశాల్లో పర్యటిస్తారు.

# నాచారం షాహి పరిశ్రమ మహిళా కార్మికుల సమ్మె 8వ రోజుకు

## - చర్చలు ఫలించకపోతే పోరాటం ఉధృతం
## - సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్




ఏ ఎం న్యూస్ ఓయూ : నాచారం షాహి పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె ఎనిమిదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కోశాధికారి పి.గణేష్ అధ్యక్షత వహించారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. మహిళా కార్మికుల పోరాటాలు చరిత్రలో ఎన్నో విజయాలు సాధించాయని గుర్తు చేశారు. కార్మికుల శ్రమను దోచుకుంటూ యాజమాన్యం లాభాలు గడిస్తోందని, అయినా వేతనాల పెంపుపై స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. గత ఎనిమిది రోజులుగా కార్మికులు స్వతంత్రంగా సమ్మె చేస్తున్నప్పటికీ యాజమాన్యం నుంచి సరైన స్పందన రాకపోవడంతో సిఐటియు అండగా నిలుస్తోందని తెలిపారు. ఈ పోరాటం విజయవంతం అయ్యే వరకు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అన్ని కార్మిక సంఘాల మద్దతు కూడగట్టేందుకు సిఐటియు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గతంలో చెన్నై సాంసంగ్ కంపెనీ కార్మికుల పోరాటంలో సిఐటియు ఎలా అండగా నిలిచిందో, అదే విధంగా షాహి పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వెన్నుదన్నుగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఢిల్లీలో జరిగే సిఐటియు జాతీయ కమిటీ సమావేశంలో షాహి పరిశ్రమలో జరుగుతున్న సమ్మె అంశాన్ని ప్రస్తావిస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా షాహి పరిశ్రమలతో పాటు ఇతర కంపెనీల ముందు ధర్నాలు చేపట్టేలా కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. జెసిఎల్ వద్ద చర్చలు జరపాలని కార్మికులకు సూచించగా, యాజమాన్యం రేపు చర్చలకు రావడానికి అంగీకరించిందని చెప్పారు. చర్చలు కార్మికులకు అనుకూలంగా ఫలిస్తే సమ్మె విరమిస్తామని, లేదంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు రమేష్, రమ, సోమన్న, ఈశ్వరరావు, సుధాకర్, జె.వెంకటేష్, కవిత, జిల్లా నాయకులు జి.శ్రీనివాసులు, వెంకన్న, రాజశేఖర్, సత్యనారాయణ, రమేష్, సంతోష్, నర్సింగరావు, టియుసిఐ నేత ప్రవీణ్, ఐఎఫ్టియు నేతలు శివబాబు, అరుణ, ఏఐటీయూ నాయకుడు సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతోనే బదిర మహిళల సాధికారత

## -అదనపు కలెక్టర్ కదిరవన్ పలని
## బదిర మహిళల జాతీయ సదస్సు విజయవంతం..




ఏ ఎం న్యూస్ ఓయూ: సాంకేతిక సహకారం, ఉన్నత విద్యతోనే బదిర మహిళల సాధికారత సాధ్యం అవుతుందనీ హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలనీ అన్నారు. ఈ మేరకు ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ది డెఫ్ ఉమెన్ ఆధ్వర్యంలో తార్నాక సెయింట్ ఆన్స్ జనరలేట్లో నిర్వహిస్తున్న బదిర మహిళల రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు విజయవంతం అయ్యింది. ఆదివారం జరిగిన సదస్సు ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ




బదిర మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఎదురయ్యే ఒడిదొడుకులను అధిగమిస్తూ అన్ని రంగాల్లో రాణించాలనీ పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి హాజరైన మాట, వినికిడి లోపం గల మహిళలు పాల్గొని విద్య. ఉపాధి, భద్రత, లింగ సమానత్వం, ప్రజా విధానాల్లో సమావేశం వంటి అంశాలపై కీలక ప్రసంగాలు, ఇంటరాక్టివ్ సెషన్లు, ఫ్యానెల్ చర్చలు జరిగాయి. ఈ ముగింపు కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి అభినయ. ఏఐఎఫ్ ప్రధాన కార్యదర్శి రోషన్కుమార్, ఏఐఎఫ్ డబ్ల్యూఎస్ అధ్యక్షురాలు వుజ్జిని జనకి, ఉపాధ్యక్షురాలు ఆల్కా సాహ్, గీతా శర్మ, హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్, పిహెచ్ ఎఎన్ ప్రధాన కార్యదర్శి పి. బాలకృష్ణారెడ్డి. అఖిల భారతీయ మార్వాడి యువ మంచ్ సభ్యుడు రాజేష్ తదితరులున్నారు..

### విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్న

# రీసోనెన్స్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

## అనధికార పరీక్షను రద్దు చేసిన విద్యాశాఖ అధికారులు




ఏ ఎం న్యూస్ ఓయూ: విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా రేపు డిసెంబర్ 14న జరగనున్న మెగా రీసో ఫాస్ట్(టాలెంట్ టెస్ట్) ను రద్దు చేయాలని, రీసోనెన్స్ విద్యాసంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విద్యాశాఖను డిమాండ్ చేయగా మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా విద్యాశాకాధికారులు (డీఈఓ) స్పందించి విద్యాశాఖ గుర్తింపు లేని రీసోనెన్స్ పాఠశాలల్లో ఎటువంటి టెస్టులు నిర్వహించరాదని ఆదేశాలు ఇచ్చారు. మెగా రీసో ఫాస్ట్ పేరిట విద్యార్థుల నుండి వసూళ్లు చేసిన ఫీజును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాచారం లో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం సెక్షన్ 13 ప్రకారం విద్యార్థులకు ఎటువంటి టాలెంట్, మెరిట్, స్కాలర్ షిప్ టెస్టులను విద్యా వ్యాపారంగా నిర్వహించొద్దని ఆదేశాలు ఉన్నా, కేవలం వ్యాపారమే ధ్యేయంగా కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయని ధ్వజ మెత్తారు. 5 నుండి 10 వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నారని, అయితే ఈ పరీక్ష రాయడానికి 300 రూపాయలను ఎంట్రన్స్ ఫీజు రూపంలో వసూళ్లు చేయడాన్ని వారు వ్యతిరేకించారు. డిసెంబర్ 14వ తేదీన ఈ పరీక్షను రీసోనెన్స్ జూనియర్ కళాశాలల్లో మరియు గుర్తింపు లేని రీసోనెన్స్ పాఠశాలల్లో నిర్వహించనున్నారని, ఒకవేళ ఈ పరీక్షను నిర్వహిస్తే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. అదేవిధంగా రీసోనెన్స్ విద్యాసంస్థకు నిజంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉచితంగా నిర్వహించొచ్చుకదా అని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించాలని రీసోనెన్స్ లాంటి మోసపూరిత విద్యాసంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రీసోనెన్స్ టాలెంట్ టెస్ట్ కు సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ. లక్ష్మీ నారాయణ ప్రమోట్ చేయడం సిగ్గుచేటని, మరి ఈ విద్యాసంస్థల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉచితంగా అభ్యసించడానికి లక్ష్మీ నారాయణ హామీ ఇవ్వగలడా అని వారు డిమాండ్ చేశారు. గుర్తింపు లేని విద్యా సంస్థలకు లక్ష్మీ నారాయణ వత్తాసు పలకడం అప్రజాస్వామికమన్నారు. మెగా రీసో ఫాస్ట్ టెస్ట్ పేరిట వసూళ్లు చేసిన ఫీజును విద్యార్థులకు తిరిగి చెల్లించాలని లేకుంటే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలక్రిష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గిరి బాబు, నేతలు అనీల్ కుమార్, మహేష్ పాల్గొన్నారు.

# బదిర మహిళల హక్కుల సాధికారతపై జాతీయ సదస్సు




ఏ ఎం న్యూస్ ఓయూ : రాజ్యాంగపర హక్కులు హక్కులతోనే బదిర మహిళా సాధికారత సాధించగలమని తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్ అన్నారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ద డెఫ్ (ఏఐఎఫ్డి) మహిళా విభాగం అధ్యక్షురాలు ఉజ్జని జానకి సభా అధ్యక్షతన మొదటి బదిర మహిళల జాతీయ సదస్సు - 2025 సికింద్రాబాద్లోని సెంట్ ఆన్స్, తార్నాక లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పీపుల్ విత్ హియరింగ్ ఇంపైర్డ్ నెట్వర్క్ ( పి హెచ్ ఐ ఎన్ ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో భారతదేశంలోని 18 రాష్ట్రాల నుంచి 150 మందికి పైగా బదిర మహిళలు పాల్గొన్నారు. మాట వినికిడి లోపం గల మహిళల హక్కులు, నాయకత్వం, విద్య, ఉపాధి, భద్రత, అందుబాటు (ఆక్సిస్సిబిలిటీ) వంటి అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. "బదిర మహిళల హక్కుల సాధికారత" అనే ప్రధాన అంశంతో ఈ జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, బదిర మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజంపై కూడా ఉందన్నారు. సంకేత భాష అందుబాటును పెంచాలని సూచించారు. ఏఐఎఫ్డి అధ్యక్షులు సునీల్ సహస్రబుద్ధే మాట్లాడుతూ బదిర మహిళల కోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయడం చారిత్రాత్మక అడుగని తెలిపరు వారి నాయకత్వాన్ని దేశవ్యాప్తంగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. ఏఐఎఫ్డి ప్రధాన కార్యదర్శి రోషన్ కుమార్ మాట్లాడుతూ, బధిర మహిళల హక్కుల కోసం జాతీయ స్థాయిలో నిరంతర పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఎంపీడీవో అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు దివ్యాంగుల హక్కుల సాధనలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎన్ఏడి ఉపాధ్యక్షులు గీతా శర్మ చెవిటి మహిళలు స్వయం ఆధారితంగా ఎదగాల్సిన అవసరాన్ని వివరించారు. బదిర మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సవాళ్లపై వక్తలు దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయ ఆకృతి డైరెక్టర్ బాబు, పిన్ ప్రధానకార్యదర్శి పిబాలకృష్ణారెడ్డి, శోభ పాల్గొన్నారు.




### బీజేపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్

# నితిన్ నబిన్‌ను సత్కరించిన పెరిక సురేష్

ఏఎం న్యూస్, హైదరాబాద్, డిసెంబరు 15 :



భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీహార్ మంత్రి నితిన్ నబిన్‌ను నియమించిన నేపథ్యంలో ఓబీసీ నేషనల్ సోషల్ మీడియా మెంబర్ పెరిక సురేష్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో పెరిక సురేష్ నితిన్ నబిన్‌ను కలిసి శాలువాతో సత్కరించి, హృదయపూర్వక అభినందనలు తెలిపారు. "బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నబిన్‌కి హృదయపూర్వక అభినందనలు. బీజేపీ యువమోర్చాలో సేవలు అందించిన ఆయన బీహార్ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం బీహార్ కేబినెట్ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నాయకత్వంలో బీజేపీ బలోపేతమైంది. అదే స్ఫూర్తిని నితిన్ నబిన్ మరింత ముందుకు తీసుకెళతారని ఆశిస్తున్నాను" అని పెరిక సురేష్ పేర్కొన్నారు. కార్యకర్తగా ఎదిగి కీలక పదవి అందుకున్న నితిన్ నబిన్‌ను అభినందిస్తూ, ఆయన అత్యంత పిన్న వయస్కుడైన యువ నాయకుడిగా, కష్టపడి పనిచేసే కార్యకర్తగా తనను తాను నిరూపించుకున్నారని సురేష్ కొనియాడారు. బీహార్‌లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు సంస్థాగత అనుభవం అపారంగా ఉందని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో శ్రద్ధ వహించారని ప్రశంసించారు. "ఆయన వినయపూర్వక స్వభావం, క్షేత్రస్థాయి పని శైలి, అంకితభావం రానున్న రోజుల్లో బీజేపీని మరింత బలోపేతం చేస్తాయి. జాతి నిర్మాణంలో బీజేపీ సమష్టి నిబద్ధత మరింత బలపడుతుంది" అని సురేష్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# అయ్యప్ప మాలదారులకు అల్పాహారం అందజేసిన అహ్మద్ హుస్సేన్ ఖాద్రి..

ఏ ఎం న్యూస్ ఓయూ :



మత సామరస్యానికి గత కొన్ని సంవత్సరాలుగా మానికేశ్వర్ నగర్ కు చెందిన మీ స్కిన్ బైతుల్ మాల్ ట్రస్ట్ నిర్వాహకులు మహమ్మద్ హుస్సేన్ ఖాద్రి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి సంవత్సరం అయ్యప్ప మాలదారులకు అల్పాహారం అందజేస్తూ తన మానవత్వాన్ని చాటుకుంటున్నాడు. ఇందులో భాగంగా శనివారం మాణిక్యేశ్వర్ నగర్ లోని 7 టెంపుల్స్ కమ్యూనిటీ హాల్లో అయ్యప్ప భక్తులతో కలిసి పూజలో పాల్గొన్నారు. అనంతరం మాలదారులకు అల్పాహారం అందజేశారు. వారితో కలిసి స్వయంగా అల్పాహారాన్ని ఆరగించారు. ఈ సందర్భంగా ఖాద్రి మాట్లాడుతూ మనం బ్రతికినంత కాలం అందరితో స్నేహపూర్వకంగా, ప్రేమగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 7 టెంపుల్స్ చైర్మన్ గండికోట విజయ్ కుమార్, దాదాపు 65. మంది అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు. సహదేవ గురుస్వామి, ఎల్లయ్యా గురుస్వామి, లక్ష్మణ్ గురుస్వామి, కృష్ణ గురుస్వామి, శ్రీనివాస్, రాజేష్, రామ్ చరణ్ , రాము, రాజు, శివ, రేవంత్ సతీష్, నాగరాజు, చింటూ, చిలుక రాము, సాయి తదితరులు స్వాములు పాల్గొన్నారు.

# 'హిందూస్థాన్ ఫస్ట్-హిందూస్థానీ బెస్ట్

ఏ ఎం న్యూస్ ఓయూ:




ముస్లిం రాష్ట్రీయ మంచ్ ఆధ్వర్యంలో ఓయూలోని దూర విద్యా కేంద్రం ఆడిటోరియంలో శనివారం ఏక్ కౌమ్ ఏకే వతన్-హిందూస్థాన్ అనే అంశంపై జాతీయ సింపోజియం జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ అక్తర్ ఆలీ పవిత్ర ఖురాన్ పఠనంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. దీనికి ముఖ్యతిథిగా ముస్లిం రాష్ట్రయ మంచ్ మార్గదర్శక్ డా. ఇంద్రేష్ కుమార్ హాజరై ప్రసంగించారు. బలమైన, శాంతియుత భారతదేశాన్ని నిర్మించడానికి ఐఖ్యత, జాతీయ గుర్తింపు, సమ్మిళిత అభివృద్ధి అవసరం అని సందేశాన్ని ఇచ్చారు. ముస్లిం సమాజం జాతీయ అభివృద్ధికి చురుకుగా దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా భారత ప్రభుత్వం ఎన్సీఎంఈఐ ఆఫిషియేటింగ్ చైర్మెన్ ప్రొ షాహిద్ ఆక్తర్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో విద్యా, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సాధికారత రంగాల్లో మైనార్టీ సంస్థల కీలక పాత్రను వివరించారు. కర్నాకట రాష్ట్ర అధ్యక్షులు, ఆల్ ఇండియా సూఫీ సజ్జద్నాషిన్ కౌన్సిల్ జనాబ్ సయ్యద్ అలీ జాకీ హుస్సేనీ, ప్రఖ్యాత ఆంకాలజీ సర్జన్ డా. మదీజ్ అహ్మద్ తాలికోటి. జామియా హమార్ జిస్ట్రార్ కల్నల్ తాహిర్ ముస్తాఫా, అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొ. పీఎఫ్ రహ్మమాన్ మాజీలు పాల్గొని మాట్లాడారు. దేశ ఐఖ్యత, శాంతి, సమ్మిళిత అభివృద్ధిపై సమిష్టి సంకల్పాన్ని ఈ సదస్సు పునర్ఘాటించింది. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పలువురు ప్రతినిధులు హాజరైనారు.



### లవన్ ఇన్సూరెన్స్ కంపెనీ

# విడుదల వాయిదా

తెలుగు, తమిళ ఇండస్ట్రీల్లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న సెలబ్రిటీల్లో టాప్‌లో ఉంటాడు ప్రదీప్ రంగనాథన్. గతేడాది లవ్‌టుడే సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ యాక్టర్ ఇప్పటికే డ్రాగన్ , డ్యూడ్ సినిమాలతో మంచి హిట్స్ ఖాతాలో వేసుకున్నాడు. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తున్న చిత్రం లవ్ ఇన్సురెన్స్ కంపెనీ. ఈ సినిమాకు నయనతార భర్త విగ్నేష్ శివన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ చిత్రాన్ని డిసెంబర్ 18న విడుదల చేయాలనుకున్నారు. అయితే ఎవరూ ఊహించని విధంగా రిలీజ్ వాయిదా పడ్డది. మూవీ త్వరలోనే విడుదల కానుందని యూఎస్ డిస్టిబ్యూషన్ కంపెనీ అధికారికంగా ప్రకటించింది. అయితే కొత్త తేదీ ఎప్పుడనేది మాత్రం చెప్పలేదు. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుందని ఇప్పటికే మేకర్స్ తెలిపారు. తాజా టాక్ ప్రకారం ఈ మూవీని వాలెంటైన్ వీక్‌లో వచ్చే ఫిబ్రవరిలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్లపై ఎస్ ఎస్ లలిత్ కుమార్‌తో కలిసి నయనతార నిర్మిస్తుంది. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, కృతి శెట్టి, యోగి బాబు, సీమాన్, గౌరీ కిషన్, షారా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌లో భవిష్యత్‌లో(2040) ప్రేమ ఎలా ఉండబోతుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుందని హింట్ ఇచ్చారు విఘ్నేశ్ శివన్ టీం.




Mana Cinemalu


## ఫీమేల్ సెంట్రిక్ రోల్‌లో భాగ్యశ్రీ



మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది భాగ్యశ్రీ బోర్సే. ఇటీవలే ఆంధ్ర కింగ్ తాలూకా, కాంతా సినిమాలలో కూడా మెరిసింది. కెరీర్లో అతితక్కువ సమయంలోనే క్రేజీ ఆఫర్ కొట్టేసింది. తాజా టాక్ ప్రకారం భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ సెంట్రిక్ సినిమాను లైన్లో పెట్టిందట. అంతేకాదు వన్ ఆఫ్ ది లీడింగ్ ప్రొడక్షన్ హౌస్ స్వప్నాదత్, ప్రియాంకా దత్ స్వప్నా సినిమా బ్యానర్‌పై ప్రతిష్టాత్మక సినిమాను తెరకెక్కిస్తున్నారు. కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు చేయడంలో ఎప్పుడూ ముందుంటుంది ఈ బ్యానర్. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ చిత్రానికి డెబ్యూ డైరెక్టర్ రమేశ్ దర్శకత్వం వహిస్తున్నాడు. పవర్ ఫుల్ ఉమెన్ సెంట్రిక్ సబ్జెక్టుతో స్క్రిప్ట్ రెడీ చేశాడట రమేశ్. ఇప్పటిదాకా గ్లామరస్ రోల్స్ లో మెరిసిన భాగ్యశ్రీని ఇక నటనకు ఆస్కారమున్న పాత్రలో చూపించబోతున్నాడట డైరెక్టర్. మహారాష్ట్రలోని ఛత్రపతి శంబాజీనగర్‌కు చెందిన ఈ భామ హిందీ ప్రాజెక్టులు యారియాన్, చందూ చాంపియన్‌లో కామియో రోల్స్ లో నటించింది. మిస్టర్ బచ్చన్ సినిమాకు గాను బెస్ట్ ఫీ మేల్ డెబ్యూ ఫర్ తెలుగు అవార్డు అందుకుంది. మరి తాజాగా చేస్తున్న లేడీ ఓరియెంటెడ్ సినిమా భాగ్యశ్రీలోని నయా యాంగిల్‌ను చూపించడం ఖాయమైనట్టేనని ఈ వార్త క్లారిటీ ఇచ్చేస్తుది. మరి భాగ్యశ్రీ ఎలాంటి కథాంశంతో ప్రేక్షకుల ముందుకొస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## బాలీవుడ్ వైపు కాంతారా..

కాంత చూపు




కాంతార చాప్టర్ 1 సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణి వసంత్ ఇప్పుడు కొత్త దిశగా అడుగులు వేస్తోంది. కాంతార చాప్టర్ 1 చిత్రంలో యువరాణి కనకవతి అనే ప్రతినాయిక పాత్రలో నటించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన రుక్మిణి, తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా హిట్ ఇచ్చిన ఆనందాన్ని ఇప్పటికీ ఆస్వాదిస్తున్నట్లు వెల్లడించింది.తెలుగు, కన్నడ చిత్రసీమలకు ఇప్పటికే పరిచయమైన ఈ బ్యూటీ, ఇప్పుడు బాలీవుడ్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. అదే సమయంలో తమిళ చిత్రాల్లోనూ క్రేజీ ఆఫర్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు సమాచారం. బాలీవుడ్‌పై తన ఆసక్తిని బహిరంగంగానే వ్యక్తం చేసిన రుక్మిణి, హిందీ భాషతో తనకున్న అనుబంధమే అక్కడ నటించాలనే తపనకు కారణమని చెప్పింది. హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. 'హిందీ నాకు చిన్నప్పటి నుంచే పరిచయం ఉన్న భాష. మా కుటుంబానికి సైనిక నేపథ్యం ఉండటంతో, వివిధ కంటోన్మెంట్ల మధ్య అనుసంధాన భాషగా హిందీ ఉండేది. అందుకే ఆ భాషపై నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇప్పటివరకు హిందీలో నటించే అవకాశం రాలేదు. కానీ, ఆ భాషలో నా ప్రతిభను నిరూపించుకోవాలని చాలా ఉత్సాహంగా ఉన్నాను. దేవుడి దయతో త్వరలోనే ఆ ప్రయాణం ప్రారంభమవుతుందని ఆశిస్తున్నాను' అని తెలిపింది.రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన కాంతార చాప్టర్ 1 విడుదలై సంచలన విజయం సాధించగా, ఇందులో రుక్మిణి వసంత్ ప్రతినాయిక పాత్రలో కనిపించి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఆమె అందచందాలు, నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ప్రస్తుతం ఈ సినిమా విజయం ఇచ్చిన ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నానని చెప్పిన రుక్మిణి, త్వరలో కాంతార టీమ్ అంతా కలిసి విజయోత్సవాన్ని జరుపుకుంటామని వెల్లడించింది. ఉత్తరాఖండ్, రాజస్థాన్, జార్ఖండ్ సహా దేశం నలుమూలల నుంచి వస్తున్న స్పందనలు తనను ఎంతో ఉత్సాహపరుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. బాలీవుడ్ ఎంట్రీతో పాటు దక్షిణాది భాషల్లోనూ రుక్మిణి వసంత్ కెరీర్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## శ్రీవారిని దర్శించుకున్న రాహుల సిప్లిగంజ్ దంపతులు



తిరుమల శ్రీవారిని గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ దంపతులు దర్శించుకున్నారు. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.

## 552 కోట్లు వసూలు చేసిన దురంధర్




కలెక్షన్స్ పరంగా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది బాలీవుడ్ మూవీ 'ధురంధర్'. డిసెంబరు 5న బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ సినిమా ఇప్పటి వరకూ రూ.552 కోట్లు వసూలు చేసింది. ఈ విజయంపై హీరో రణ్‌వీర్ సింగ్ స్పందిస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'అదృష్టానికి మంచి అలవాటు ఉంది. సమయానికి తగ్గట్టు అది మారుతూ ఉంటుంది. కానీ, ఓర్పు చాలా ముఖ్యం' అని పేర్కొన్నారు. తన గత చిత్రాల ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఇలా రాసినట్టు అనిపిస్తోంది. 2025లో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన భారతీయ చిత్రాల జాబితాలో 'ధురంధర్'ది ప్రస్తుతానికి నాలుగో స్థానం. 'కాంతార: చాప్టర్ 1' తొలి స్థానంలో, 'ఛావా' ద్వితీయ స్థానంలో, 'సైయారా' తృతీయ స్థానంలో ఉన్నాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ సినీ ప్రముఖులనూ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమాని మెచ్చిన వారిలో అల్లు అర్జున్ ఒకరు. నిడివి ఎక్కువైనా కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని ఈ సినిమా మూడున్నర గంటలతో మరోసారి రుజువైంది. హీరో రణ్‌వీర్‌తోపాటు కీలక పాత్ర పోషించిన అక్షయ్ ఖన్నాకు ఈ సినిమాతో మరింత పేరొచ్చింది. ఈ సినిమాలో ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌గా నటించిన మాధవన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ధురంధర్' ట్రైలర్‌లాంటిదని, అసలు సినిమా 'ధురంధర్ 2' అంటూ అభిమానుల్లో అంచనాలు పెంచారు. సీక్వెల్‌లో రణ్‌వీర్ నటన మరో స్థాయిలో ఉంటుందన్నారు. పార్ట్ 1తో పోలిస్తే పార్ట్ 2లో తన పాత్రకు స్కోప్ ఎక్కువ అని మాధవన్ తెలిపారు. 2026 మార్చి 19న 'ధురంధర్ 2' విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.